క్లుప్తంగా

మైతాపూర్‌కు బస్సొచ్చింది



ఆర్టీసీ బస్సు వద్ద గ్రామస్తులు, నాయకులు

రాయికల్: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చొరవతో మండలంలోని మైతాపూర్‌కు ఆర్టీసీ బస్సు వచ్చింది. ఇటీవల గ్రామస్తులు బస్సు నడిపించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, బుధవారం కోరుట్ల డిపోకు చెందిన బస్సు గ్రామంలోకి రావడంతో గ్రామస్తులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ అజారోద్దీన్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ గోపి మాదవి, నాయకులు రాధ, జ్యోతి, అహల్య, గంగవ్వ పాల్గొన్నారు.

కేజీబీవీలో కంప్యూటర్ శిక్షణ తరగతుల పరిశీలన



విద్యార్థినులతో మాట్లాడుతున్న అధికారులు

కథలాపూర్: మండలకేంద్రంలోని కేజీబీవీలో నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణ తరగతులను జిల్లా మహిళా సాధికారత కేంద్రం అధికారులు హేమశ్రీ, గౌతమి బుధవారం పరిశీలించారు. విద్యార్థినులకు ఏ విధంగా కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. బేటి బచావో బేటి పడావో పథకం గురించి, బాలికల హక్కులు, అత్యవసర సమయాల్లో ఉపయోగించాల్సిన హెల్ప్‌లైన్ నెంబర్ గురించి వివరించారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, స్పెషల్ ఆఫీసర్ రాజకళ ఉన్నారు.

అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు



పోటీల్లో ఎంపికైన విద్యార్థులు

మెట్‌పల్లి: పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీలకు బుధవారం సెలెక్షన్స్ జరిగాయి. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం 550 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో లాంగ్‌జంప్, షాట్‌పుట్ నిర్వహించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ విభాగం రాష్ట్ర అబ్జర్వర్ రాజాగౌడ్, ఉపాధ్యక్షుడు కపిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తయ్య, అసోసియేషన్ సభ్యులు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందన వనరుల పరిరక్షణ వారోత్సవాలు



సోలార్ అక్షర ఆకృతిలో విద్యార్థులు

కోరుట్ల: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ ఇందన వనరుల పరిరక్షణ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా చివరి రోజు బుధవారం 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు వ్యాసరచన, రంగవల్లులు, గోరింటాకు,చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించారు. పట్టణంలో సౌర విద్యుత్ వినియోగిస్తున్న శివసాయి ఆస్పత్రి డాక్టర్ భోగ శంకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇందన వనరుల పొదుపుపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో రెడ్‌కో డిపో మేనేజర్ పరమాచారి, ఏడీవో లక్ష్మీకాంతం, హెచ్‌ఎం భూపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకన్న మొక్కు తీర్చుకున్న జోగిన్‌పెల్లి గ్రామస్తులు



కోరుట్లరూరల్: మండలంలోని జోగిన్‌పెల్లి గ్రామానికి చెందిన 50 మంది బుదవారం తిరుపతి వెంకటేశ్వరున్ని దర్శించుకున్నారు. కోరుట్ల ఎమ్మెల్యేగా కల్వకుంట్ల సంజయ్ గెలిస్తే తిరుపతి వచ్చి మొక్కు చెల్లించుకుంటామని మొక్కుకున్నారు. సంజయ్ గెలవటంతో ప్రత్యేక బస్సులో తిరుపతి వెళ్లి మొక్కు చెల్లించుకున్నట్టు సర్పంచ్ దుంపాల నర్సు-నర్సయ్య, గ్రామస్తులు తెలిపారు.

అర్హులను ఓటరు జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ పడాల తిరుపతి

రాయికల్: ఓటరు జాబితాలో బీఎల్వోలదే కీలక పాత్ర అని మాస్టర్ ట్రైనర్ పడాల తిరుపతి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితా సవరణపై బీఎల్వోలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు కడకుంట్ల అభయ్‌రాజ్, మాచర్ల మహేశ్, పడాల తిరుపతి మాట్లాడుతూ ఓటరు జాబితాలో బీఎల్వోలది కీలక పాత్ర అని, ఇంటింటికీ సర్వే నిర్వహించి జనవరి 2024 వరకు 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేసి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖయ్యూం, ఆర్‌ఐలు కాంతయ్య, పద్మయ్య, సీనియర్ అసిస్టెంట్ రమేశ్ పాల్గొన్నారు.

యువత ఓటర్‌గా నమోదు చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం: మండలంలోని అన్ని గ్రామాల్లో జనవరి 1 2024 వరకు 18 ఏళ్లు నిండే యువతీయువకులకు ఓటర్‌గా నమోదు చేయాలని, గ్రామాల్లో మృతి చెందిన, గ్రామం విడిచి వెళ్లిన వారికి నోటీస్ జారీ చేసి తొలగించాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, ఎంపీ ఎన్నికలకు తప్పులు లేకుండా ఓటర్ల జాబితా రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, శిక్షకులు ఎస్పీ లింబగిరి స్వామి, బి. చిన్నయ్య, ఎస్ చంద్రశేఖర్, ఎస్పీ విక్రమ్, ఆర్‌ఐలు రమేశ్ గంగాధర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

మల్యాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం అసెంబ్లీ లెవల్ మల్టీ ట్రైనర్స్ ఆధ్వర్యంలో పోలింగ్ బూత్ అధికారులు, సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. నూతన ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు చేయడంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ మునీందర్, ఆర్‌ఐ జి.తిరుపతి, శిక్షకులు సతీశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర



పెగడపల్లిలో కరపత్రం విడుదల చేస్తున్న అధికారులు

పెగడపల్లి: మండలంలోని నామాపూర్, పెగడపల్లి గ్రామాల్లో బుధవారం వికసిత్ భాతర్ సంకల్ప్ యాత్ర వాహనాలు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, మోదీ ప్రసంగాన్ని టీవీ ద్వారా ప్రదర్శించి కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమాల్లో సర్పంచులు కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్, ఎంపీడీవో పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు, బీజేపీ మండల అధ్యక్షుడు కొమురెల్లి, ఉప సర్పంచులు, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు ఎంపీడీవో ప్రభు వివరించారు. కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామాల్లో ఎల్‌ఈడీ టీవీల్లో చూపించారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, ఏపీఎం శంకర్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి ఎంపీల తీరుపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: ఉపరాష్ట్రపతిని అవమానించేలా వ్యవహరించిన ఇండియా కూటమి ఎంపీల తీరును వ్యతిరేకిస్తూ బుధవారం జగిత్యాల తహసీల్ చౌరస్తాలో భారత్ సురక్షా సమితి ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు మాట్లాడుతూ భారత ఉపరాష్ట్ర పతి, రాజ్యసభ వైస్ చైర్మన్ జగదీశ్ ధనఖడ్‌ను తృణమూల్ ఎంపీ అవమానించడం సిగ్గు చేటన్నారు. రాజ్యసభ నడవకుండా అడ్డుకోవడమంటే ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనన్నారు. పార్లమెంట్‌పై, ప్రజాస్వామ్యంపై గౌరవం లేని ఎంపీలను శాశ్వతంగా అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కాశీనాథం, ప్రతినిధులు బాసెట్టి ప్రభాకర్, మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రావు, మల్లేశం, భూమన్న, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, చుక్క అశోక్, గంగారాం, బిట్టు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణంపై పునరాలోచించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రాయికల్: మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని సవరించాలని బుధవారం ధర్మసమాజ్ పార్టీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెల్లరేషన్‌కార్డు ఉన్న వారికే బస్సు సౌకర్యం కల్పించాలని, ఆటోడ్రైవర్లకు రూ.3 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జీవన్, స్వామి, రాము, ప్రణయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మేడిపల్లి: మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారని, పథకాన్ని సవరించి పునరాలోచించాలని బుధవారం ధర్మసమాజ్ పార్టీ నాయకులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. తెల్ల రేషన్ ఉన్న మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణం కల్పించాలని, ఆటోడ్రైవర్లకు నెలకు రూ.3 వేల భృతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాబు, కోటేశ్, విజయ్, ప్రశాంత్, అనిల్, నిజాముద్దీన్, గంగాధర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు జెడ్పీ చైర్‌పర్సన్ అభినందన

జగిత్యాలజోన్: ఈనెల 15 నుంచి 18 వరకు పంజాబ్‌లో జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న జ్యోతి హైస్కూల్ విద్యార్థులను బుధవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత బుధవారం అభినందించారు. విద్యార్థులు భాను, వర్ష, మధుకీర్తన, ప్రీతంకృష్ణను సన్మానించి, రానున్న రోజుల్లో మరింతగా రాణించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రఘువరన్, జెడ్పీటీసీ నాగం భూమయ్య, పాఠశాల డైరెక్టర్లు బియ్యాల హరిచరణ్‌రావు, శ్రీధర్ రావు, మౌనిక రావు, అజిత, రజిత, పీఈటీలు పాల్గొన్నారు.

వెల్గటూర్‌కు చేరిన అయోధ్య రాముని అక్షింతలు



అక్షింతలు ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు

వెల్గటూర్: అయోధ్య రాముని అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేయనున్నట్లు వీహెచ్‌పీ నాయకులు తెలిపారు. మండల కేంద్రానికి బుధవారం అయోధ్య రాముల అక్షింతలు చేరుకోగా, శ్రీరామ భక్తాంజనేయ ఆలయ కమిటీ, గ్రామస్తులు ఆలయం వరకు మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. జనవరి 22న అయోధ్య రాముని ఆలయ ప్రతిష్ఠాపన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మేరుగు నరేశ్, సర్పంచ్ మురళిగౌడ్, గట్ల రాజేందర్, గంట్యాల విద్యాసాగర్, గండ్ర వసంతరావు, గండ్ర శ్రీకాంత్‌రావు, ధర్మాజి గంగారాం, బందెల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి పొన్నంను కలిసిన సీనియర్ సిటిజన్స్

జగిత్యాల: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా శాఖ సభ్యులు మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబును బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మంత్రులకు అన్ని సమస్యలను వివరించామన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవనీత్‌రావు, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడు యాకూబ్, రాములు, కేశవరెడ్డి పాల్గొన్నారు.

పొలం గట్లపై కొబ్బరి మొక్కలు నాటాలి



రామన్నపేటలో మొక్కలు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో

మల్యాల: రైతులు అదనపు ఆదాయం కోసం పొలం గట్ల వెంట కొబ్బరి చెట్ల పెంచుకోవాలని జెడ్పీ సీఈవో రఘువరన్ అన్నారు. మండలంలోని రామన్నపేటలో పొలం గట్ల వెంట కొబ్బరి మొక్కలు నాటుకున్న రైతు పొలాన్ని సీఈవో, ఎంపీడీవో వెంకటేశం, ఈజీఎస్ సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ రైతులు వరి పొలాల గట్ల వెంట కొబ్బరి మొక్కలు నాటుకుంటే ఐదేళ్లలో అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. కొబ్బరి మొక్కలు నాటుకున్న వారికి ఈజీఎస్, హార్టికల్చర్ ఆధ్వర్యంలో 3 ఏళ్లపాటు నిర్వహణ వ్యయం చెల్లిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.కార్యక్రమంలో ఈజీఎస్ ఈసీ మనోజ్, ఏపీవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

ధర్మపురి: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని నిరసిస్తూ బుధవారం బీజేపీ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గత కొన్ని నెలల నుంచి ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరినా పట్టించుకోలేదని అన్నారు. ప్రజాప్రతినిధులు పట్టించుకుని సమస్య తీర్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బెజ్జారపు లవన్‌కుమార్, సంగెపు గంగారాం, మర్రిపెల్లి సత్యం, పిల్లి శ్రీనివాస్, ఆకుల శ్రీనివాస్, గాజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



అడ్లూరికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో నాయకులు బుధవారం జగిత్యాలలో కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తిరుమల గంగాధర్, కొంతం రాజం, నయీం, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

రైస్ మిల్లుల్లో అధికారుల తనిఖీ

కథలాపూర్: మండలంలోని సిరికొండ శివారులోని రెండు రైస్ మిల్లులను సివిల్ సప్లయ్ అధికారులు మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. రైస్ మిల్లుల లోని రికార్డులు, బియ్యం నిల్వలను పరిశీలించారు. రైస్ మిల్లులను ఎందుకు తనిఖీ చేశారనే విషయం చెప్పడానికి సంబంధిత శాఖ అధికారులు నిరాకరించారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీల్లో భాగంగానే సిరికొండ శివారులోని రైస్ మిల్లులను తనిఖీ చేసినట్లు ఓ అధికారి చెప్పడం విశేషం.

రాయికల్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ

రాయికల్: పట్టణంలోని కిరాణ షాపులు, బేకరీలను బుధవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. నాణ్యత లోపించిన యజమానులకు జరిమానా విధించారు.

యూరియా కోసం రైతుల అవస్థలు



లారీ వద్ద యూరియా తీసుకెళ్తున్న రైతులు

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద బుధవారం రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. 10 రోజులుగా యూరియా కొరతతో రైతులు తమ మొక్కజొన్న పంటలకు యూరియా వేయలేకపోయారు. 450 బస్తాలతో యూరియా లారీ రాగానే రైతులు యూరియా కోసం రావడంతో ఒకొక్క రైతుకు 3 నుంచి 4 బస్తాలను సొసైటీ అధికారులు ఇచ్చారు. ఇబ్రహీంపట్నం సొసైటీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం, అమ్మక్కపేట, వర్షకొండ, కోమటికొండాపూర్, ఎర్దండి గ్రామాలు ఉండగా, రైతులు మొక్కజొన్న, జొన్న, వరి ఎక్కువగా ఉండటం వలన ఎక్కువ మొత్తంలో యూరియా అవసరం ఉండటంతో అధికారులు రైతులకు సరిపడా యూరియాను సరాఫరా చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు సరిపడా ఇంకా 100 టన్నుల యూరియా అవసరమని సింగిల్‌విండో చైర్మన్ బద్దం గోపి తెలిపారు. యూరియా కొరత లేకుండా సరాఫరా చేయాలని అధికారులను కోరారు.

అంగన్‌వాడీ కేంద్రం సేవలు సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల: అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. బుధవారం 6వ వార్డులో వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్రలో భాగంగా ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వం పథకాల అమలు తీరును వివరించారు. పోషణ్ అభియాన్ పథకం ద్వారా గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అక్షరాభ్యాసం లాంటి ఎన్నో సేవలు అందిస్తున్నామన్నారు. చిన్నారుల తల్లులు, గర్భవతులకు పోషకాహారం అందించడంతో పాటు, వారిలోని రక్తహీనత నివారించడానికి ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబు, కౌన్సిలర్ హేమ, మధుకర్, శ్రీధర్, స్వరూపరాణి పాల్గొన్నారు.

కాల్వ పనులు నాణ్యతతో చేయాలి

మల్లాపూర్: మండలంలోని సిరిపూర్ నుంచి గుండంపల్లి వైపు వెళ్లే ఎస్సారెస్పీ కాల్వ పనులు నాణ్యతతో చేయాలని సర్పంచ్ భూక్య గోవింద్ అన్నారు. గత వాన కాలంలో ఈ కాల్వకు గండి పడగా మరమ్మతులు చేపడుతున్నారు. ఈ పనులను సర్పంచ్ గోవింద్ బుధవారం పరిశీలించి మాట్లాడారు. సకాలంలో పనులు పూర్తిచేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. పంటలకు త్వరగా నీరు అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఉత్సవం



అభిషేకం చేస్తున్న అయ్యప్ప దీక్షాపరులు

కథలాపూర్: మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి ఉత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామికి భక్తులు, దీక్షాపరులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అయ్యప్పస్వామి పేరిట భజనలు చేశారు. గూడెం గురుస్వామి చక్రవర్తులు పురుషోత్తమచార్యులు, సర్పంచ్ కంటి నీరజ, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ మామిడిపెల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పంటలు పరిశీలించిన ఏవో

మల్లాపూర్: మండలంలోని సంగెం-శ్రీరాంపూర్‌లో వరి నారు, ఆవాలు, మొక్కజొన్న పంటలను వ్యవసాయాధికారి లావణ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చలి ప్రభావంతో వరి నారు సరిగ్గా ఎదగక ఆకులు చిన్నవిగా, పసుపు రంగులోకి మారుతూ ఉంటాయన్నారు. నారును సంరక్షించుకోవడానికి చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. రాత్రి పూట నారుమడి నుంచి చల్లటి నీరు తీసివేసి ఉదయం పూట వెచ్చని నీటిని పెట్టాలన్నారు. జింక్ లోప నివారణకు రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని, నారుమడి వాడిపోతే కార్బెండజైమ్,మంకోజెబ్ అనే మిశ్రమ మందును రెండు గ్రాములు తీసుకుని లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

యువతులు టైలరింగ్ శిక్షణ పొందాలి

సారంగాపూర్: యువతులు, మహిళలు ఆర్థికంగా ఎదగడానికి స్వయం ఉపాధి అవసరమని, టైలరింగ్‌లో శిక్షణ పొందితే భవిష్యత్తులో మంచి ఫలితాలు ఉంటాయని వక్తలు పేర్కొన్నారు. బుధవారం సారంగాపూర్‌లో కరీంనగర్‌కు చెందిన దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం ఆధ్వర్యంలో 45 రోజుల పాటు నిర్వహించే శిక్షణను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో రాజేందర్, సర్పంచ్ రాజేశ్వరి, జిల్లా మేనేజర్ సునంద, ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీ, సూపర్‌వైజర్ లత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి

పెగడపల్లి: ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి సాధించుకోవచ్చని సర్పంచ్ మేరుగు శ్రీనివాస్ అన్నారు. పెగడపల్లిలో సాధారణ సమావేశం బుధవారం జరిగింది. గ్రామ పంచాయతీ ఆదాయ, వ్యయాలు, చేపట్టిన అభివృద్ధి పనులను కార్యదర్శి ప్రవీణ్ ప్రజలకు వివరించారు. గ్రామంలో చేపట్టనున్న అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇంటి, నల్లా నీటి పనులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీ జమున, ఉప సర్పంచ్ సాగర్‌రావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను పోలీస్,రెవెన్యూ అధికారులు బుధవారం సీజ్ చేశారు. గ్రామంలో ఓ చోట 20 ట్రాక్టర్ ట్రిప్పులకు పైగా ఇసుక డంపులు ఉన్నట్లు గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై అన్వర్‌బేగ్, జూనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కాపర్ వైర్ చోరీ

కోరుట్ల రూరల్: పట్టణ శివారులోని సంగెం రోడ్డులో టౌన్-1 పరిధిలోని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లారు. బుధవారం విద్యుత్ రూరల్ ఏఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో లైన్‌మెన్ గోపాల్‌రెడ్డి, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గన్నీ సంచులు కాల్చివేసిన వ్యక్తిపై కేసు నమోదు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో గన్నీ సంచులను కాల్చివేసిన వ్యక్తిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై గౌతంపవార్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన సురివి సంతోష్‌రావు తన ధాన్యంను కొనుగోలు కేంద్రంలో పోశాడు. ధాన్యం తూకం వేయడం లేదని పేర్కొంటూ మంగళవారం రాత్రి అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, 600 గన్నీ సంచులకు నిప్పుపెట్టడంతో సంచులు పూర్తిగా కాలిపోయాయి. దీనిపై పీఏసీఎస్ సిబ్బంది ఫిర్యాదుతో సంతోష్‌రావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టీఆర్టీఎఫ్ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా వాసులకు చోటు

ధర్మపురి: తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా గజభీంకార్ గోవర్ధన్, కార్యదర్శిగా దాసరి భీమయ్యను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కటకం రమేశ్, కావలి అశోక్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం అభివృద్ధికి చేసిన కృషి ఫలితంగా వీరిని ఏకగ్రీవంగా నియమించినట్లు పేర్కొన్నారు. గోవర్ధన్, భూమయ్య ఎన్నికపై జిల్లా అధ్యక్షుడు సురేశ్, కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, కాసర్ల వెంకటరమణ అభినందించారు.

బీజేపీ అధ్యక్షుడిగా సత్తయ్యగౌడ్

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామ బీజేపీ అధ్యక్షుడిగా సత్తయ్యగౌడ్, ఉపాధ్యక్షుడిగా లోకిని స్వామి, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, కోశాధికారిగా కుంట సత్యంరెడ్డి, కార్యదర్శిగా మామిడి తిరుపతి, నరేశ్‌గౌడ్ బుధవారం ఎన్నికయ్యారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బాలో ఆత్మహత్య చేసుకున్న పున్నం శ్రీనివాస్ కుటుంబాన్ని బుధవారం కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. మృతుడి భార్యకు ఆర్థిక సాయం అందచేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బుస రాజేశ్వర్, నాయకులు జాన శంకర్, దేవన్న, ప్రభాకర్, లింగన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన బసవరాజం బుధవారం మృతి చెందగా, జువ్వాడి కృష్ణారావు ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు. పలవురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయి, నాయకులు రాజారెడ్డి, రాజేందర్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: హైదరాబాద్‌లో నిర్వహించిన కరాటే బ్లాక్ బెల్ట్ పరీక్షల్లో సత్తా చాటిన జేకేఏ ఇండియా షాటోకాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు కె. హర్షవర్ధన్, కె. హేమంత్, విశ్వంత్ ను బుధవారం పలువురు అభినందించారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా తెలంగాణ స్టేట్ ప్రధాన శిక్షకులు రాపోలు సుదర్శన్ బ్లాక్ బెల్ట్‌లు, ప్రశంసాపత్రాలు అందచేశారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ప్రధాన శిక్షకులు ప్రవీణ్‌కుమార్, శిక్షకులు, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

మండలంలో 1.15 లక్షల ధాన్యం సేకరణ

కథలాపూర్: మండలంలో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 11 వరి కొనుగోలు కేంద్రాల్లో 1,15,230 క్వింటాళ్ల ధాన్యం సేకరించినట్లు ఏపీఎం నరహరి బుధవారం తెలిపారు. కేంద్రాల వారిగా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఇలా.. అంబారిపేటలో 9,367 క్వింటాళ్లు, బొమ్మెనలో 8,156 క్వింటాళ్లు, భూషణరావుపేటలో 9,200 క్వింటాళ్లు, చితకుంటలో 7,306 క్వింటాళ్లు, దూలూర్‌లో 10,445 క్వింటాళ్లు, కథలాపూర్‌లో 12,835 క్వింటాళ్లు, పెగ్గెర్లలో 9,077 క్వింటాళ్లు, పోతారంలో 14,808 క్వింటాళ్లు, సిరికొండలో 8,290 క్వింటాళ్లు, తక్కళ్లపెల్లిలో 10,500 క్వింటాళ్లు, తాండ్ర్యాలలో 15,242 క్వింటాళ్ల ధాన్యం సేకరించినట్లు ఏపీఎం నరహరి పేర్కొన్నారు.